# అద్దెకొంప

నేనేదో మహా అనుభవం ఉన్నవాణ్ణి కాదుగానీ, రకరకాల మనుష్యులతో నాకూ పరిచయం వుంది. కొందరితో స్నేహం చేశాను. కొందరిని ఆప్తులుగా భావించాను. ఇంకో బాపతు జనాన్ని వుంచవలసినంత దూరంగానూ వుంచాను. లోకంలో రకరకాల మనస్తత్వాలున్నవా రుంటారని, నాకు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఎందుకంటే—నాకున్న పరిచయస్థుల్లో, చాలా రకాలవారూ, అనేక వర్గాలకు చెందినవారూ వున్నారు. వారి వారి అభిప్రాయాలతో, నాకు ఏకీభావం కుదరని సందర్భాలు బొచ్చెడున్నాయి. అంతమాత్రాన వారంతా నా విరోధులని, నే నెట్లా అనను?

ఎవరి గొడవ వారిదీ, ఎవరి కష్టసుఖాలు వారివీను! నేను అర్చేవాణ్ణీ తీర్చేవాణ్ణీ కాదు. ఇట్లా సరిపెట్టుకొనే, నేను శివరామయ్యగార్ని ఏమీ అనేవాణ్ణి కాదు. చూడటానికి శివరామయ్య చాలా సాత్వికుడుగానూ, మాంచి వ్యవహారవేత్తగానూ వుండేవాడు. భాగ్యమ్మగారు కూడా ఆయనకు తగ్గదేననిపించింది. అదీగాక — వాళ్ళు చాలాకాలం క్రిందటే మద్రాసులో స్థిరపడిపోయిన తెలుగువాళ్ళు. సగం అందుకే నే నా యింట్లో ప్రవేశించాను.

ఏదైనా తింటేగానీ రుచీ తెలియదు. దిగితేగానీ లోతు తెలియదు. ఆ యింట్లో మూణ్ణెల్లపాటు, అప్పనంగా, నే నుండకపోయినట్లయితే, శివరామయ్య ఇలాంటివాడని—హరిహరాదులు చెప్పినా నమ్మేవాణ్ణి గాదు. పైకి సాధువులుగా కనిపించే వారిలో, ఎంతటి రాక్షసత్వం దాగివుండటానికి అవ

కాశం వుందో, ఆయన్ను చూసిందాకా, నాకు తెలియదు.

భార్యా భర్తలన్న తరవాత, మాటామాటా రావడమూ, కీచులాడుకోవడమూ సహజం కావచ్చు. వాళ్ళ గొడవతో మనకెందుకులెస్తూ—అనే; వాళ్ళ కీచులాటల్లో నేను వేలుపెట్టేవాణ్ని కాదు. నా భార్యను కూడా అటు కేసి వెళ్ళవద్దని గట్టిగా చెప్పాను.

భార్యల్ని వేపుకుతినడం కూడా వ్యాధి కిందకే వస్తే, శివరామయ్య ఆ జబ్బుతో బాగా తీసుకొంటున్నవాడి కిందకే వస్తాడు. ఆయన పెళ్ళాన్ని అనరాని మాటలనే వాడు. నిమిష నిమిషానికీ కొట్టటానికి మీది మీదికి పొయ్యే వాడు. ఆయనున్న కాసేపూ ఇల్లు యుద్ధరంగంలా ఉండేది.

నే నిది చాలాకాలం భరించాను. చాలాకాలం పస్తాయించాను. ఆఖరికి వుండబట్టలేక, ఒక రోజున తెగ బడ్డాను.

'అది నా స్వంత విషయం! ఇందులో మీ ప్రమేయం మేమీ లేదు.' అన్నాడాయన.

ఇలాంటి సమాధానమే వస్తుందని నాకు తెలుసు. అప్పుడు నేను నోరుమూసుకోవలసివస్తుందని కూడా తెలుసు. ఇన్ని తెలిసి కూడా మరెందుకు తలదూర్చానయ్యా—అని, నన్నడక్కండి! భాగ్యమ్మ పడే చిత్రహింసలు చూడలేక నే తల దూర్చాను.

నే నలా జోక్యంచేసుకోవడం చాలా మంచిదే అయింది. శివరామయ్య పెళ్ళాన్ని కాల్చుకుతినడం తగ్గి పోయింది. ఓ మంచిపని చేశానన్న సంతృప్తి కలిగింది.

అయితేఇంతకు రెండింతలు, ఆమెను రహస్యంగా వేధించుకుతింటున్నాడని. భాగ్యమ్మ గారు చెప్పిందాకా నాకు తెలియదు. ఆమె నా దగ్గర, తన సొదంతా వెళ్ళబోసుకొంది.

'అయ్యో, నాయనా! నువ్విలా నన్ను వెనకేసుకురాక పోయినా బాగుణ్ణు' అని కంటతడిబెట్టుకొంది భాగ్యమ్మగారు.

'ఏమయిం దేమిటండి?' అన్నాను.

'ఆ పాపిష్టి మాటలన్నీ నా నోట మళ్ళా ఎందుకు చెప్పిస్తావు నాయనా!' అన్నదామె, తప్పుకొంటూ.

నేను మా ఆవిణ్ణి పిలిచి అడిగాను!

'ఆఁ ఈ మొగజాతి కేముందీ! పెళ్ళాల్ని కాల్చుకు తినడం మొక్కటే చేతవును.' అన్నదావిడ.

'అది సరేనే! భాగ్యమ్మగారు నన్ను చూసి, కళ్ళనీళ్ళు పెట్టుకొంటుం దేమిటి? నే నేం చేశాను?' అన్నాను.

'అప్పటికీ నేను ఒద్దు మొర్రో అంటుంటెని. నా మాట వినకపోతిరి. అనవసరంగా వెళ్ళి వేలుపెడితిరి. ఇప్పుడు భాగ్యమ్మగారి పీకలమీదకొచ్చింది...అదిగాదండీ! మంచి వాళ్ళతో మంచి గానీ, ఇలాంటి లుచ్చాలతో మంచేమిటండీ నా బొంద? 'వాడికీ నీకూ ఏమీలేకపోతే, వాడెందుకు నీ తరపున వస్తాడూ' అన్నాట్ట శివరామయ్య. 'ఈ ఉద్దేశ్యంతో నేనా, వాడిదగ్గర అప్పన్ను పుచ్చుకొన్నదీ!' అన్నాట్ట. 'ఇలా ఎంత కాలం నుంచి రంకు సాగిస్తున్నావ్?' అన్నాట్ట. ఆ మానవు రాలు, నిన్నటినుంచీ, గంగ ముట్టకుండావుంది! మీ రేం చేసినా ఇలాగే చేస్తారు. దోవనబోయ్యే తద్దినాన్ని నెత్తికి చుట్టుకో

న్నారు. అనుభవించండి!' అన్న ద్రావిడ.

భార్యల్ని అనుమానించే భర్తలు నాకు తెలుసు. అలాంటి భర్తలు, పెళ్ళాల్ని పెట్టే రంపకోత నాకు తెలుసు. కానీ ఇదేమిటి? ఆవిడకు నాకు పాత్రేమిటి? కనీసం ఆవిడ కొడుకు వయస్సు కూడా నాకు లేదే?

శివరామయ్య ముఖం చూడ్డానికే డోకేసింది. ఇలాంటి దగుల్బాజీ కొంపలో ఒక్క క్షణం కూడా వుండకూడదను కొన్నాను. ఇప్పుడే ఇంతమాట అన్నవాడు— రేపు ఇంకేమైనా అంటాడు.

ఆ తెల్లవారే, ఇంకో ఇంట్లోకి మారాను. కనీసం మాట మాత్రమైనా 'ఎందుకు మారుతున్నా' రని శివరామయ్య అడగలేదు. ఆయన ముఖం చూస్తే, 'ఈ పీడా ఎప్పుడు వదిలిపోతుంది భగవంతుడా' అన్నట్టుంది.

అయితే వారం తర్వాతగానీ నాకు అసలు సంగతి తెలియలేదు. నేనుఖాళీచేసిన సాయంత్రమే నాకంటే పదిహేను రూపాయల ఎక్కువ అద్దెకు శర్మ ఆ యింట్లో చేరాడు.

శివరామయ్య, భార్యను ఎందుకు అనుమానించిందీ అప్పుడు నాకర్థమయింది. రేపు శర్మకన్న మరో అయిదు రూపాయలు ఎక్కువిచ్చేవాడు దొరికినప్పుడు, శివరామయ్య, మళ్ళీ భార్యను అనుమానిస్తాడు. ఆవిడ శర్మముందు, మళ్లీ కళ్ల వెంట నీళ్ళు పెట్టుకొంటుంది.

నాకు పట్టుకొన్న బాధల్లా ఒక్కటే? మొగవాడు గనక శివరామయ్య ఏదో అఘోరించాడు; ఈ భాగ్యమ్మకెట్లా బుద్ధిలేదా – అని?